సోమవారం 23-09-2024

# ముందడుగు

సంపుటి: 1, సంచిక: 464 పేజీలు: 4 | ₹6

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

EPAPER.MUNDADUGU.COM

దినపత్రిక

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com



## జమ్మూకశ్మీర్‌లో త్రివర్ణ పతకమే రెపరెపలాడుతుంది

### ఆర్టికల్ 370ని ఏ శక్తి తిరిగి తీసుకురాలేదు: ఎన్నికల సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా

ముందడుగు జమ్మూకశ్మీర్:

జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజౌరీ జిల్లా నౌషేరాలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన రాజ్యాంగ అధికరణం 370 రద్దు చేస్తూ కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కానీ, అధికారం వచ్చాక ఆ ఆర్టికల్‌ను పునరుద్ధరిస్తామని ఫరూక్ అబ్దుల్లా చెబుతున్నారు. ఏ శక్తీ దాన్ని తిరిగి తీసుకురాలేదు. ఇప్పుడు ఈ ప్రాంతంలో బంకర్ల అవసరం లేదు.

మిగతా 2లో

## తనను అవినీతిపరుడిగా నిరూపించే కుట్ర

### మా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించారు


### ప్రధాని మోడీపై అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణ



ముందడుగు ఢిల్లీ:

ప్రధాని మోడీ తనను అవినీతిపరుడిగా నిరూపించేందుకు కుట్ర పన్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. తనపై గెలవాలంటే తన నిజాయితీపై దాడి చేయాలని మోడీ భావించారంటూ మండిపడ్డారు. ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన 'జనతాకీ అదాలత్' కార్యక్రమంలో అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడారు. 'ప్రధాని నరేంద్ర మోదీ మాపై కుట్ర పన్నారు. నన్ను, (ఆప్ నేత) మనీష్ సిసోడియా అవినీతిపరుడని నిరూపించేందుకు కుట్ర పన్నారు. మా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించారు' అని అన్నారు.

మిగతా 2లో



రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్

మిగతా 2లో



అందాల తాజ్ మహల్ పని ముగిసిందా..?

మిగతా 3లో



తెలంగాణలో నాలుగు రోజులు భారీ వర్షాలు

మిగతా 3లో



ప్రొఫెషనలిజం పేరుతో మంచి నిర్ణయాలపై దాడి..

మిగతా 5లో

## ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాలే కూల్చివేత

### కూల్చివేతలపై హైడ్రా ప్రకటన విడుదల

ముందడుగు హైదరాబాద్:

హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డిలో పలుచోట్ల భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఆదివారం చేపట్టిన కూల్చివేతలపై హైడ్రా ప్రకటన విడుదల చేసింది. కూకట్‌పల్లి నల్లచెరువులో అనధికారిక షెడ్లను కూల్చివేసినట్లు

మిగతా 2లో



## సింగరేణి కార్మికులకు ఇచ్చింది బోగస్

- కాంగ్రెస్ పాలనలో 20 శాతానికి మించిన వాటా
- బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

ముందడుగు హైదరాబాద్:

తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ప్రకటించింది దసరా బోనస్ కాదు.. బోగస్ అని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్

మిగతా 2లో



ముందడుగు
సోమవారం, 23-09-2024, హైదరాబాద్

## జమ్మూకశ్మీర్‌లో త్రివర్ణ పతకమే రెపరెపలాడుతుంది

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకంటే.. కాల్పులు జరిపే సాహసం ఎవరూ చేయలేరు. జమ్మూకశ్మీర్‌లో కేవలం మన దేశ త్రివర్ణ పతకం మాత్రమే రెపరెపలాడుతుంది'' అని అమిత్ షా పేర్కొన్నారు.

కొందరు పాకిస్థాన్‌తో చర్చలు జరపాలని బలంగా కోరుకుంటున్నారు. కానీ, ఉగ్రవాదం అంతమయ్యే వరకు వారితో ఎలాంటి చర్చలు జరిపేది లేదు. దేశంపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను జైలు నుంచి విడుదల చేయాలని వారు (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) కోరుకుంటున్నారు. కానీ, మోదీ సర్కార్ అలా ఎన్నటికీ చేయదు. భారత ప్రజలపై రాళ్లు రువ్విన వారికి కారాగారం నుంచి విముక్తి కల్పించేది లేదు'' అని షా మరోసారి స్పష్టం చేశారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత మొదటిసారిగా అసెంబ్లీ ఎన్నికలు (సెప్టెంబరు 18న తొలి విడత, సెప్టెంబరు 25న రెండో విడత, అక్టోబరు 1న మూడో విడత) జరుగుతున్నాయి.

## తనను అవినీతిపరుడిగా నిరూపించే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

తాను గత పదేళ్లుగా నిజాయితీతో ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపానని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. తనపై గెలవాలంటే తన నిజాయితీపై దాడి చేయాలని ప్రధాని మోదీ భావించారని విమర్శించారు. 'సీఎం కుర్చీపై ఆకలి లేకపోవడం వల్లే రాజీనామా చేశా. డబ్బు సంపాదించడానికి కాదు, దేశ రాజకీయాలను మార్చేందుకే వచ్చా' అని అన్నారు. సీఎం పదవికి రాజీనామా చేసిన తాను మరికొద్ది రోజుల్లో సీఎం అధికార నివాసం నుంచి వెళ్లిపోతానని తెలిపారు. పదేళ్లపాటు సీఎంగా ఉండి కూడా ఢిల్లీలో తనకు సొంత ఇల్లు లేదన్నారు.

## రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్

- ప్రేమ్‌పుర్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తింపు
- పరిశీలించిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్

ముందడుగు ఉత్తరప్రదేశ్:

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లోని ప్రేమ్‌పుర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఢిల్లీహౌరా రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్‌ను అమర్చిన ఘటన ఆదివారం గుర్తించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ , రైల్వే పోలీసులు అక్కడకి చేరుకుని పరిశీలిస్తున్నారు. పట్టాలపై ప్రమాదాన్ని గుర్తించే సమయానికి లూప్‌లైన్‌లో కాన్పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు ఒక గూడ్స్ రైలు వెళుతోంది. ఒక ఎక్స్‌ప్రెస్ రైలుకు దారి ఇచ్చే క్రమంలో దాని ఆపాల్సి వచ్చింది. అప్పుడు లోకోపైలట్ సిలిండర్‌ను గమనించి తక్షణమే అధికారులకు సమాచారం అందించడంతో పెను ప్రమాదం తప్పింది.




మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పుర్‌లో రైలు పట్టాలపై 10 డిటోనేటర్లను బుధవారం గుర్తించారు. సగ్పట రైల్వే స్టేషన్ వద్ద ఈ ఘటన చోటు చేసుకొంది. జమ్మూకశ్మీర్ నుంచి కర్ణాటకకు ఈ మార్గంలో సైనికులను తరలిస్తున్న రైలు కింద ఇవి బయటపడ్డాయి. ఒకటి పేలడంతో లోకోమోటీవ్ పైలట్‌కు అనుమానం వచ్చి రైలును ఆపేసి అధికారులకు సమాచారం అందించారు. వారు పట్టాలపై పేలుడు పదార్థాలు ఉన్నట్లు పసిగట్టారు. రైళ్లను పట్టాలు తప్పించి, ప్రమాదాలకు గురిచేసేలా కుట్రపూరిత ప్రయత్నాలు ఇటీవల కాలంలో పెరిగాయని కేంద్రం పేర్కొంది. ఆగస్టు నుంచి ఈ తరహాలో 18 ఘటనలు వెలుగుచూశాయని రైల్వేశాఖ ఇటీవల తెలిపింది.

## ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాలే కూల్చివేత

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. నల్లచెరువులోని సర్వే నెంబర్ 66, 67, 68, 69లోని షెడ్లను కూల్చివేశామని.. 16 వాణిజ్య షెడ్లు, ప్రహరీ గోడలు నేలమట్టం చేసినట్లు పేర్కొంది. నల్లచెరువు పరిధిలో నాలుగు ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పింది. సంగారెడ్డి అమీన్‌పూర్ మండలంలో ఆక్రమణలు కూల్చివేశామని వెల్లడించింది.



ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాలను కూల్చివేసినట్లు పేర్కొంది. కిష్టారెడ్డిపేటలోని సర్వే నెంబర్ 164లో మూడు భవనాలు కూల్చివేశామని.. వాణిజ్య పరంగా వినియోగిస్తున్న భవనాన్ని నేలమట్టం చేసినట్లు వెల్లడించింది. కిష్టారెడ్డిపేటలో ఒక ఎకరం ప్రభుత్వ స్థలం స్వాధీనం చేసుకున్నట్లు వివరించింది. పటేల్‌గూడలో 25 అక్రమణ నిర్మాణాలను నేలమట్టం చేశామని.. సర్వే నంబర్ 12/2, 12/3లోని 25 నిర్మాణాల కూల్చివేత చేపట్టినట్లు చెప్పింది. పటేల్‌గూడలో మూడెకరాల ప్రభుత్వ స్థలం స్వాధీనం చేసుకున్నామని.. మూడు ప్రాంతాల్లో దాదాపు ఎనిమిది ఎకరాల ప్రభుత్వ స్థలం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. వ్యాపారం కోసం నిర్మించిన భవనాలను మాత్రమే కూల్చివేసినట్లు వివరించింది.

## సింగరేణి కార్మికులకు ఇచ్చింది బోగస్

(మొదటిపేజీ తరువాయి)

హయాంలో సింగరేణి ఎన్నో విజయాలు సాధించిందన్నారు. కాంగ్రెస్ హయాంలో లాభాల్లో వాటా 20 శాతానికి మించలేదని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సింగరేణి ప్రైవేటీకరణ ప్రక్రియను అడ్డుకునేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే సింగరేణిలో రూ.1,060 కోట్ల లాభాలు తీసుకొచ్చాం. 201415లో 102 కోట్లకు పైగా కార్మికులకు ఇచ్చాం. 201819లో రికార్డు స్థాయిలో లాభాలు వచ్చాయి. ఆ ఏడాది ఒక్కో కార్మికుడికి రూ.లక్ష ఇచ్చాం. 2014లో రూ.17 వేలు ఇస్తే.. పదేళ్లలో లాభాలు పెంచి 2023 నాటికి




1.60 లక్షలు అందజేశాం. ప్రభుత్వం శనివారం ప్రకటించింది దసరా బోనస్ కాదు.. బోగస్. దీంతో ఒక్కో కార్మికుడికి రూ.1.80 లక్షల నష్టం కలిగే పరిస్థితి వచ్చింది. దీనిపై సీఎం నేరుగా సమాధానం చెప్పాలి. డిప్యూటీ సీఎం రూ.4,701కోట్ల లాభాలు వచ్చాయని చెప్పారు. అందులో 33 శాతం వాటా (రూ.1,551కోట్లు) కార్మికులకు ఇచ్చామన్నారు. కార్మికుడికి 33 శాతం వాటా ఇస్తే ఒక్కొక్కరికి రూ.3.70లక్షల లాభం రావాలి. కానీ ప్రభుత్వం రూ.1.90లక్షలు మాత్రమే బోనస్‌గా ప్రకటించడాన్ని ఎలా చూడాలి? 16.2శాతం లాభాల్లో వాటాగా ఇస్తూ 33 శాతం అని మభ్యపెడుతున్నారు. సింగరేణి బెల్ట్ మొత్తం కాంగ్రెస్‌ను గెలిపించింది. వాళ్లకు మీరిచ్చే బహుమతి ఇదా? కేంద్రంలో ఉన్న బిజెపి సింగరేణిని ప్రైవేటీకరణ చేయాలని చూస్తోంది.. కాంగ్రెస్ దానికి సహకరిస్తోంది. కార్మికులకు భారాస అండగా ఉంటుంది.'' అని కేటీఆర్ అన్నారు.

ముందడుగు
సోమవారం, 23-09-2024, హైదరాబాద్

# పని ఒత్తిడి తట్టుకోలేక రాలుతున్న ప్రాణాలు

## మొన్న సీఏ మృతి.. నేడు టెకీ ఆత్మహత్య

ముందడుగు జాతీయం:



కార్పొరేట్ ఆఫీస్‌లలో పని ఒత్తిడి తట్టుకోలేక అనారోగ్యం పాలు కావడం, ప్రాణాలు తీసుకుంటున్న వారి సంఖ్య పెరిగిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల పూణేలో ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా కంపెనీకి చెందిన ఓ యువ ఉద్యోగి పని ఒత్తిడి కారణంగా అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటన తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఘటనపై రాజకీయ నాయకులే కాకుండా పలు వ్యాపారవేత్తలు స్పందిస్తున్నారు. తాజాగా చెన్నైలో మరో ఉద్యోగి వర్క్ ప్రెజర్ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం ప్రస్తుతం సంచలనంగా మారింది.

తమిళనాడులోని తేని జిల్లాకు చెందిన కార్తికేయన్ అనే 38 ఏళ్ల వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు కాగా.. వారంతా చెన్నైలో నివసిస్తున్నారు. ఈ క్రమంలోనే చెన్నైలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే కార్తికేయన్.. డిప్రెషన్‌తో బాధపడుతూ చెన్నైలోని తన ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే పని ఒత్తిడి కారణంగానే కార్తికేయన్ ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అతని భార్య అనుమానం వ్యక్తం చేసినట్లు చెన్నై పోలీసులు వివరించారు. గత 15 ఏళ్లుగా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో కార్తికేయ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. కార్తికేయ ఆఫీస్‌లో తీవ్రమైన పని ఒత్తిడి కారణంగా ఇబ్బంది పడుతున్నట్లు ఆయన భార్య పేర్కొన్నారు. రెండు నెలలుగా ఆయన డిప్రెషన్‌కు చికిత్స కూడా తీసుకున్నారు.

ఇటీవల కేరళకు చెందిన అన్నా సెబాస్టియన్ అనే 26 ఏళ్ల యువతి.. మహారాష్ట్రలోని పూణేలోని ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా అనే కంపెనీలో పనిచేస్తుండగా.. తీవ్ర అనారోగ్యానికి గురైంది. దీంతో తోటి ఉద్యోగులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ చనిపోయింది.



# అందాల తాజ్ మహల్ పని ముగిసిందా..?

■ మొన్న ప్రధాన గుమ్మటం నుంచి నీరు లీక్
■ తాజాగా తాజ్ మహల్‌పై పగుళ్లు

ముందడుగు జాతీయం:

అందమైన కట్టడం తాజ్ మహల్. విదేశీయులు సైతం ఆ కట్టడాన్ని చూసి ఆశ్చర్యపోతారు. అలాంటి అద్భుత కట్టడం గత కొన్ని రోజులుగా ఆ అద్భుత కట్టం పరిస్థితి చూస్తుంటే తాజ్ లవర్స్‌కు కంటి మీద కునుకు ఉండటం లేదు. ఇటీవల ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు తాజ్ మహల్ ప్రధాన గుమ్మటం నుంచి నీరు లీక్ కావడం తీవ్ర ఆందోళనకు గురి చేసింది. తాజాగా తాజ్ మహల్‌పై పగుళ్లు కనిపించాయి. తాజ్ మహల్ గోడలు, కింది భాగంలోని అంచుల వద్ద కూడా కొన్ని చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. వీటితోపాటు ప్రధాన డోమ్‌కు వద్ద కూడా ఒక మొక్క మొలిచింది. వీటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ కావడం కలకలం రేపుతోంది.

గతవారంలో తాజ్ మహల్ పరిసరాల్లో ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు ప్రధాన డోమ్‌లో నుంచి వర్షం నీళ్ల లీక్ కావడంతోపాటు వరద ఉధృతికి యమునా నది తాజ్ మహల్ గోడను తాకుతూ ప్రవహించింది. అంతేకాకుండా తాజ్ మహల్ ఎదురుగా ఉన్న గార్డెన్ కూడా వరదనీటితో మునిగిపోయింది. ఇది జరిగి వారం గడవకముందే డోమ్‌పై మొక్క పెరగడం, గోడలకు పగుళ్లు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై ఆగ్రా సర్కిల్ పురావస్తు శాఖ అధికారిని ప్రశ్నించగా.. తాజ్ మహల్ మాత్రమే కాదు.. ఇతర స్మారక చిహ్నాలన్నింటి మూలల్లో మొక్కలు పెరగడం సర్వ సాధారణం అని చెప్పారు. అలాంటి మొక్కలు మొలకెత్తడం గమనించిన వెంటనే తొలగిస్తామని తెలిపారు.

# తెలంగాణలో నాలుగు రోజులు భారీ వర్షాలు

## పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ.. హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

ముందడుగు తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రంలో రాగల నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది.

సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడుతాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశాలున్నాయని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరిలో 10 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయ్యింది. ఆ తర్వాత సంగారెడ్డి జిల్లా దిగ్వాల్‌లో 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ముందడుగు
సోమవారం, 23-09-2024, హైదరాబాద్



# అనాథలు, నిరాశ్రయులకు 261వ అన్నదాన కార్యక్రమం

ముందడుగు హైదరాబాద్:

హైదరాబాద్ మహానగరంలో ఫుట్‌పాతుల మీదనే జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులు, సంచార జాతుల వారిని గుర్తించి ఆహారాన్ని అందించారు. అకాలవర్షాలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ వివిధ రోగాల బారిన పడుతున్నారు. ఈ అభాగ్యుల విషయంలో మానవతా దృక్పథంతో ప్రభుత్వం అలోచించి, చొరవ తీసుకోని నగరంలో పలు మొబైల్ వైద్యశాలలను ఏర్పాటు చేసి అనాథలు, నిరాశ్రయులు ఎక్కడ ఉంటే అక్కడే ఆరోగ్యపరీక్షలు చేసి ఔషధాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ 261వ అన్నదాన కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని, సేవ సభ్యులు కుషి కోమాల్, అఖిల్, శుభం, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో విజిఎల్ఎస్ హెల్త్ కేర్ రంగం సేవలు

## పీఆర్జెనిక్స్ టెక్ సపోర్ట్ సహాయంతో కార్యకలాపాలు

ముందడుగు హైదరాబాద్:

నేటి ఆరోగ్యరంగంలో ప్రతి ఒక్కరికి హెల్త్ ఐడి అవసరం. వహ్నిజా గ్లోబల్ లైఫ్ సైన్సెస్ కంపెనీ డిజిటలైజేషన్ ఫర్ హెల్త్ కేర్ ప్రారంభోత్సవ కార్యక్రమం రామంతపూర్ లోని ఇందిరా ఇంపీరియా గ్రాండ్‌లో అట్టహాసంగా జరిగింది. విజిఎల్ఎస్ హెల్త్ కేర్ రంగంలో డిజిటలైజేషన్ సర్వీసెస్ కల్పించడానికి పీఆర్జెనిక్స్ వారి టెక్ సపోర్ట్ సహాయంతో దక్షిణ భారతదేశంలోని తమ కార్యకలాపాలను మొదటిసారిగా తెలంగాణలో ప్రారంభించారు. ఈ సర్వీసెస్ తో పాటు ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్ ఐడి రిజిస్ట్రేషన్ ని కూడా ముందుకు తీసుకెళ్తున్నారని కంపెనీ అధినేత డాక్టర్ ప్రియదర్శిని వింజమూరు ప్రస్తావించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ యదుకుల్ హైదరాబాద్ ఎయిమ్స్ డిప్యూటీ సూపరిండెంట్ మరియు ఏబీడియం నోడల్ ఆఫీసర్ ఆరోగ్య రంగంలో డిజిటలైజేషన్ ఎంత ముఖ్యమో ప్రతి ఒక్కరికి హెల్త్ ఐడి ఉండడం ఎంత ఉత్తమమో జాతీయ ప్రభుత్వము తీసుకుంటున్న ఎబిడిఎమ్ చర్యల డిజిటల్ ఐడిలు ఉండడం వల్ల జరిగే లాభాల ప్రస్తావించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న ఐఐహెచ్చి ప్రెసిడెంట్ డాక్టర్ ఎంఎన్ రాజు నేటి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కాలంలో మార్పుతో పాటు మార్పుని అందుకోవడము తప్పనిసరని లేకపోతే కనుమరుగైపోతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్జెనిక్స్ సీఈవో వినోద్ పాట, సోమ సుందర్ శర్మ కంపెనీ అధినేత డాక్టర్ ప్రియదర్శిని ఇతర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్స్‌లో మానేపల్లి నవకర్ నవరాత్రి ఉత్సవ్-2024

## 9 రోజుల సాంప్రదాయ పద్ధతిలో వివిధ కార్యక్రమాలు

ముందడుగు హైదరాబాద్:

9 రోజుల సాంప్రదాయ పద్ధతిలో మానేపల్లి బృందా నవకర్ నవరాత్రి ఉత్సవ్ 2024 సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్స్‌లో 03 అక్టోబర్ 2024 నుండి 11 అక్టోబర్ 2024 వరకు నిర్వహిస్తున్నారు. అతిపెద్ద నవరాత్రి ఈవెంట్‌లలో ఇది ప్రధానమైనది. ఈ ఈవెంట్‌ని తల్లీ కూతుళ్లు అయినా సలోని జైన్ & కవితా జైన్ క్యూరేట్ నిర్వహిస్తున్నారు. నవకర్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్రాండ్ పాస్ లాంచ్‌ను నిర్వహించింది. ఐశ్వర్య షా మరియు చింతన్ మెహతాచే ఉచిత గార్బా & దాండియా వర్క్‌షాప్‌ను క్లాసిక్ గార్డెన్స్‌లో ప్రముఖ టీవీ నటి నేహా స్వరూప్, వినీతా సురానా, మానేపల్లి జ్యువెలర్స్‌కు చెందిన మిస్టర్ గోపీ, బ్రిండా బంగ్స్ నుండి కృష్ణ దియామోన్‌లచే నిర్వహించబడింది. కవితా జైన్ మాట్లాడుతూ నవకార్ నవరాత్రి ఉత్సవ్‌లో ఏసీ అరేనా, 5 రోజుల పాటు కాంప్లిమెంటరీ డిన్నర్, లిప్ స్మాకింగ్ ఫుడ్ కోర్ట్, ప్రముఖ బాలీవుడ్ సెలబ్రిటీ సౌరభ్ రాజ్ జైన్, హ్యూజ్ అవుట్‌డోర్ లాన్ ఏరియా, అద్భుత కల్పిస్తున్నట్లు తెలిపారు. మహా హారతి అష్టమి రోజున & పాల్గొనే వారందరికీ 25 లక్షల విలువైన ప్రత్యేక బహుమతులు అందజేస్తున్నామన్నారు.



# ఆశ్రయ్ అక్కృతి ఆధ్వర్యంలో సైనథాన్ 2024 నిర్వహణ



ముందడుగు హైదరాబాద్:

వినికిడి లోపాలతో బాధపడుతున్న వ్యక్తుల శ్రేయస్సు కోసం అంకితమైన ఆశ్రయ్ అకృతి స్వచ్ఛంద సంస్థ అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని పురస్కరించుకుని 22 సెప్టెంబర్, 2024న హైదరాబాద్లోని గచ్చిబౌలి స్టేడియంలో ఉదయం 9:00 నుండి 11.00 గంటల వరకు 'సైనథాన్ 2024'ని నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని క్వాల్కాం సంస్థ టెక్నాలజీ మరియు పేటెంట్ కౌన్సెల్ సీనియర్ డైరెక్టర్ నితిన్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశ్రయ్ అకృతి వ్యవస్థాపక డైరెక్టర్ డిపికే బాబు మాట్లాడుతూ ఆశ్రయ్ అకృతి యొక్క 'సైనథాన్ 2024' మిషన్ "వాక్ ఫర్ ఇన్ క్లూజివిటీ" అనే ఇతివృత్తంతో రూపొందించబడింది, కమ్యూనికేషన్ అంతరాలను తగ్గించడం, వినికిడి లోపం ఉన్నవారి హక్కుల పరిరక్షణలో సంకేత భాష ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడమే లక్ష్యంగా గత 28 సంవత్సరాలుగా ఆశ్రయ్ అకృతి కృషి చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో 2 కి.మీ సైన్ మార్చ్, భారతీయ సంకేత భాష (ఇండియన్ సైన్ లాంగ్వేజ్) పై ఇంటరాక్టివ్ సెషన్లు, విద్యార్థుల ప్రదర్శనలతో కూడిన టాలెంట్ ప్రదర్శన, ఫ్లాష్మాబ్, చివరగా భారతీయ సాంకేతిక భాషలో జాతీయ గీతం ఆలాపన జరిగింది.

ముందడుగు
సోమవారం, 23-09-2024, హైదరాబాద్



# ప్రొఫెషనలిజం పేరుతో మంచి నిర్ణయాలపై దాడి..

- విచక్షణ మరిచిన అనుభవజ్ఞులు..
- సీఎం రేవంత్ నిర్ణయాన్ని స్వాగతించలేని వైనం



ముందడుగు హైదరాబాద్:

తెలంగాణ ఏర్పాటైన పదేండ్లకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. పదేండ్ల తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కొలువుదీరి పట్టుమని పది నెలలు కూడా గడవక ముందే విపక్షాలు, సోషల్ మీడియాకు ప్రతినిధులుగా ఉండే యూట్యూబ్ చానళ్ల నిర్వాహకులు, అనుభవజ్ఞులైన సీనియర్ పాత్రికేయులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇందుకు ఉదాహరణ ఈ నెల ఎనిమిదో తేదీన తెలంగాణ సీఎం ఏ రేవంత్ రెడ్డి.. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టుల సొసైటీకి పేట్ బషీరాబాద్‌లోని 38 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆదేశాలను సొసైటీకి అప్పగించారు. ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ యూట్యూబ్ చానళ్లకు స్వీయ నియంత్రణ అవసరం హితోక్తులు చెబితే దానిపై చిలవలు పలవలు చేసి వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాకైనా, సమాజంలోని వ్యక్తులకైనా స్వీయ నియంత్రణ అవసరం. ఆ సంగతి విస్మరించిన యూట్యూబ్ చానళ్ల నిర్వాహకులు రేవంత్ రెడ్డి సర్కార్ మీద దుమ్మెత్తి పోశారు. జేఎన్జే హౌసింగ్ సొసైటీలో బూటకపు సభ్యత్వం ఉందంటూ.., ఆంధ్రా జర్నలిస్టులకు అప్పనంగా రూ.3600 కోట్ల విలువైన భూమి కట్టబెట్టారంటూ విమర్శలు గుప్పించారు. ఎవడబ్బ సొమ్మంటూ ఎదురుదాడి చేశారు. దీనికి నల్లబాలు.. తెల్లబాలు అనే పేర్లతో ఫేక్ సోషల్ మీడియా అకౌంట్లతో ఎక్స్‌లో ట్వీట్ల వర్షం కురిపించారు. కానీ, 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. జర్నలిస్టులకు అనుకూలంగా సుప్రీంకోర్టులో అఫిడవిట్లు వేసినా ఆచరణలో ఆ పని చేయలేదు. ఈ భూమి కేటాయించాలని కోరేందుకు జర్నలిస్టులను కలిసేందుకు కూడా ప్రభుత్వాధినేతలు కనికరించలేదు.

మరో అడుగు ముందుకేసి తెలంగాణ ఉద్యమ వేళ.. కీలకంగా వ్యవహరించిన జర్నలిస్టులు క్రాంతి కిరణ్, పల్లె రవి కుమార్‌లను సొసైటీకి ఎటువంటి ఎన్నికలు లేకుండానే డైరెక్టర్లుగా చొప్పించారు. 2017లో జస్టిస్ చలమేశ్వర్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులతో కదిలిన జర్నలిస్టుల ఒత్తిడి మేరకు నిజాంపేటలోని 32 ఎకరాల భూమిని 2018 చివర్లో కేటాయించింది నాటి తెలంగాణ ప్రభుత్వం. లీగల్ ఒపీనియన్ అనుకూలంగా ఉన్నా పేట్ బషీరాబాద్ సైట్ స్వాధీనం చేసేందుకు ఆ ప్రభుత్వానికి మనస్కరించలేదు. వాస్తవంగా అప్పటి ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్.. పేట్ బషీరాబాద్ సైట్‌ను ఐటీ టవర్స్‌కు కేటాయించాలని చేసిన ప్రయత్నాన్ని ప్రస్తుత సొసైటీ డైరెక్టర్‌లు పీవీ రమణారావు, కే అశోక్‌రెడ్డి తదితరులతో కూడిన టీంజేఎన్జే తిప్పికొట్టింది.

ఇచ్చిన మాటకు కట్టుబడి, మడమ తిప్పని నేతగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల ఎనిమిదో తేదీన జేఎన్జేహెచ్ఎస్ మ్యాక్‌కు పేట్ బషీరాబాద్ సైట్ స్వాధీనం చేశారు. కానీ ఈ సైట్‌పై కన్నేసిన కొందరు పెద్దలకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం నచ్చలేదు. అందుకే సోషల్ మీడియా వేదికగా ఆంధ్రా, తెలంగాణ విభేదాలు పురిగొల్పేందుకు పూనుకున్నారు. కొందరు యూట్యూబ్ చానళ్ల నిర్వాహకులను ఎంచుకుని మరీ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై విమర్శలు గుప్పించారు. 2014 నుంచి నోరు మెదపని సీనియర్ పాత్రికేయులు.. ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయాన్ని ఆక్షేపిస్తూ ప్రధాన మీడియాలోనూ, సోషల్ మీడియాలోనూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయాన్ని కొంతమంది జర్నలిస్టులు వ్యంగ్యంతో కూడిన వ్యాసాలు గుప్పించారు.

## ఏవుసం కనుమరుగవుతోంది..!



"దేశంలో కాదు ప్రపంచంలోనే ఏవుసం చేసే అన్నదాతల సంఖ్య తగ్గిపోతుంది.. తినే వారు విపరీతంగా పెరుగుతుంటే పంట పండించే రైతుల సంఖ్య భారీగా తగ్గిపోతుంది. ఆ కాయ కష్టం చేయలేక, పండిన పంటకు సరియైన ధర వస్తుందో, లేదో తెలియక కాడిని వదిలేసి పట్నాలకు వలస పోతున్నారు. వ్యవసాయాన్ని ప్రోత్సాహిస్తూ, రైతులకు భరోసాగా ఉండాల్సిన ప్రభుత్వాలు ఉచితాల పేరుతో పథకాలు ప్రకటిస్తూ చేతులు దులుపుకుంటున్నాయి.. అదీ కూడా తెల్లారితే మట్టితో జీవనం చేసే వారికి దక్కుతున్నదెంతో తెలియదు.. భవిష్యత్తులో రైతును ఎగ్జిబిషన్ ప్రదర్శనలో చూడాల్సిన పరిస్థితి వచ్చేలా ఉంది..!"

**- రాజేంద్ర పల్నాటి,**
పౌండర్, యూత్ ఫర్ యాంటీకరప్షన్

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గుత్తికోయలకు దుప్పట్లు పంపిణీ



ముందడుగు ములుగు:

లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ వివేకానందపురం మరియు వరంగల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో లయన్స్ ఏరియా లీడర్ దీపక్ భట్టాచార్జీ చొరవతో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసి) వారు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంత గుత్తికోయ ఆదివాసులకు వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో నాలుగు వందల దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీపీసీ మానవ వనరుల జనరల్ మేనేజర్ ఎస్ఎన్ పాణిగ్రాహి, ఉభయ తెలుగు రాష్ట్రాల ఏరియా లీడర్ లయన్ దీపక్ భట్టాచార్జీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లయన్ పింగిలి నాగరాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ములుగు జిల్లాలో గత ఐదు సంవత్సరాలుగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించడంలో సహకరించిన ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్ మరియు వెంకటాపూర్ ఎస్ఐ సతీష్‌లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మరియు వరంగల్ నుండి వచ్చిన సుమారు 35 మంది లయన్స్ సభ్యులు, ఎన్టీపీసీ సీనియర్ మేనేజర్ గౌతమ్ సింగ్ భాటి ఉత్సాహంగా పాల్గొని వెంకటాపూర్ పరిధిలోని ఆరు గుత్తికోయ ఆవాస ఆదివాసులకు దుప్పట్లు పంపిణీ చేశారు.